
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 27 । ఆగస్టు । 2024



సోమశిలలో 31.910 టీఎంసీలు
సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారానికి 31.910 టీఎంసీలు ఉంటే.. జలాశయానికి 15,010 క్యూసెక్కుల వరద వస్తోంది. కండలేరుకు 2వేలు, దిగువకు 550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,270
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,723
3 శాతం జీఎస్టీతో	రూ.6,925
నవర (8 గ్రా)	రూ.55,400

గరిష్టం/కనిష్టం
38.9 /29.4

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉండి... ఒకటి.. రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ 45 శాతం ఉంది.

దాడులు చేస్తుంటే వైద్యం చేయగలమా



ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లుగా చేరామంటే పేదలకు వైద్య సేవలు చేయాలనే వచ్చాం. అలాంటి తమకు ప్రభుత్వం విధి నిర్వహణలో ఉన్న సమయంలో తగినంత భద్రత, రక్షణ కల్పించాలి. మహిళా వైద్యులు, నర్సింగ్ సిబ్బందిపై దాడి చేసే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి సత్వర శిక్షలు అమలు చేయాలి. ఎవరైనా వైద్యులపై అకృత్యాలకు పాల్పడాలంటేనే భయపడాలి. కోల్‌కతా వంటి ఘటన మరొకటి జరగకుండా దోషులను తక్షణమే శిక్షించాలి.
– డాక్టర్ కాలేషాబాషా, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

రాత్రి వేళ పోలీస్ పహారా తప్పనిసరి



ప్రతి గవర్నమెంట్ హాస్పిటల్‌లో రాత్రి వేళ ఒక పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో 24/7 వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రి సమయాల్లో లోకల్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తూ, రిజిస్టర్‌లో సంతకాలు చేసేలా చర్యలు చేపట్టాలి. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ ఫర్ మెడికోస్ అనే ఒక ప్రత్యేక చట్టాన్ని తయారు చేసి వైద్య సిబ్బంది మీద దాడి చేసిన ఎవరినైనా కఠినంగా శిక్షించాలి.
– డాక్టర్ కర్నాటి రోహిత్, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జేఏసీ

మహిళలు పనిచేసే చోట సెక్యూరిటీ పెంచాలి



మహిళలు విధుల్లో ఉండే ప్రతి చోట సెక్యూరిటీని పెంచాలి. కోల్‌కతా ఘటన దేశ వ్యాప్తంగా మహిళా వైద్యులు, సిబ్బందిలో అభద్రతా భావాన్ని కల్పించింది. ఇలాంటి దోషులకు కఠినంగా శిక్ష పడేలా ప్రత్యేక చట్టాలు తేవాల్సిన అవసరం ఉంది. మహిళలు, మహిళా డాక్టర్లు, బాలికలపై అకృత్యాలకు పాల్పడే వారిని అత్యంత కఠినంగా శిక్షించాలి. మహిళా రక్షణపై ప్రభుత్వం మాటల వరకే పరిమితం కాకుండా ఆచరణలో చేసి చూపించాలి.
– డాక్టర్ శ్రీనునాయక్, నెల్లూరు

న్యూస్‌రీల్

డీసీపల్లిలో 661 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 661 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 767 బేళ్లు వచ్చాయన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 82,182.2 కిలోల పొగాకును విక్రయించగా రూ.22,480,558.50 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195 లభించింది. సగటు ధర రూ.273.55గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో టీపీఓ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో టీపీఓ దేవేంద్రను నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కుంభకోణంలో ఇద్దరు టీపీఓ (టౌన్‌ప్లానింగ్ అధికారి)లు, మేయర్ భర్త జయవర్ధన్, అతని సహాయకుడు, మరో ఇద్దరు సచివాలయ ఉద్యోగులపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి కేసు విచారణ చేపట్టారు. నిందితులు పరారీలో ఉండడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం టీపీఓ ధర్మేంద్రను అరెస్ట్ చేశారు. మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహించనున్నారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా రెండు పాఠశాలలకు మాత్రమే సంస్కృతం పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు, 4వ తేదీ వరకు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ తయారు చేసిన ప్రశ్నపత్రాన్ని ఏ రోజుకారోజు ఇవ్వనున్నారు. ప్రైవేట్ పాఠశాలలు సొంత ప్రశ్నపత్రాలతో పరీక్ష నిర్వహించాలి. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్‌తో, 9, 10 తరగతుల విద్యార్థులకు సాధారణ పరీక్షలు ఉంటాయి. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10.45 నుంచి 11.45 గంటల వరకు, 9, 10 తరగతులకు 11 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు.

మర్రిపాడులో 28,516 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ

మర్రిపాడు: జిల్లాలోని మర్రిపాడు ఇసుక నిల్వ కేంద్రంలో సోమవారం 124 ఇసుక బుకింగ్ ఆర్డర్లు వచ్చినట్లు జిల్లా భూగర్భ, గనుల శాఖాధికారి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుకింగ్ ఆర్డర్ల మేరకు 1,128 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేయగా 28,516 మెట్రిక్ టన్నుల నిల్వ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇసుక పంపిణీకి సంబంధించి ఒక ఫిర్యాదు రాగా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బుకింగ్ కేంద్రం ద్వారా మాత్రమే ఇసుక ఆర్డర్ బుక్ చేసుకుని ఇన్వాయిస్ కలిగిన వాహనాలను మాత్రమే ఇసుక నిల్వ కేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇసుకకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నంబరు 0861–2943569లో సంప్రదించాలని కోరారు.

జామతోట దగ్ధం

- రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం

అనుమసముద్రంపేట: జామతోట దగ్ధమై సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిన ఘటన మండలంలోని హసనాపురంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితుడు పరుచూరి రమణయ్య సమాచారం మేరకు.. తన సొంత పొలం సుమారు 10 ఎకరాల్లో జామ చెట్లను సాగు చేస్తున్నాడు. వీటితో పాటు టేకు చెట్లను సైతం పెంచుతున్నాడు. సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టేకు చెట్లు తగలబడడంతో పాటు సుమారు ఐదు ఎకరాల్లో జామ చెట్లు దగ్ధమైనట్లు ఆయన వాపోయారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షలకు పైగా ఉంటుందన్నారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం మంటలను అదుపులోకి తీసుకురావడంతో మిగిలిన చెట్లను కాపాడుకోగలిగామన్నారు.

రియల్.. ఢమాల్

అనధికార లేఅవుట్ల పేరుతో ఎమ్మెల్యేల దాదాగిరి

- రూ.కోట్లు ఇస్తే మౌనం.. లేకపోతే విధ్వంసం
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే టార్గెట్
- అనుమతి లేవంటూ పత్రికా ప్రకటనలు
- రిజిస్ట్రేషన్లు జరగకుండా సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు
- ప్రజాప్రతినిధులు ఆడమన్నట్లుగా మున్సిపల్, నుడా అధికారులు
- కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం

కూటమి ప్రభుత్వం కుట్రలకు రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయింది. ఎన్నికల్లో ఖర్చు పెట్టిన రూ.కోట్లు తిరిగి రాబట్టుకునేందుకు ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారంలోకి వచ్చీరాగానే రియల్ వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తూ అక్రమ లేఅవుట్ల పేరుతో వెంచర్ల ఆర్చ్‌లను ధ్వంసం చేశారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే లక్ష్యంగా వారికి సంబంధించిన లేఅవుట్ల క్రయవిక్రయాలపై ఆంక్షలు విధించారు. రిజిస్ట్రేషన్లు చేయొద్దంటూ రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్, నుడా అధికారులు అనుమతి లేవంటూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రజాప్రతినిధులు ధన దాహానికి రియల్ ఎస్టేట్ రంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. టీడీపీ నేతలు అక్రమంగా వేసిన లేఅవుట్లలోని ప్లాట్లు విక్రయించుకునేందుకు వీలుగా ఇతరులు వేసిన లేఅవుట్లపై నిషేధం విధించారు. మున్సిపల్, నుడా అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఎమ్మెల్యేలు చెప్పినట్లుగా అధికారులు నడుచుకుంటూ రియల్ ఎస్టేట్ వెంచర్లను జేసీబీలు పెట్టి కూల్చేయడంతో ఒక్కసారిగా రియల్‌ఎస్టేట్ రంగం కుదేలైంది. ఎక్కడికక్కడే క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. ఆయా వెంచర్లల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.

ఎకరాకు రూ.10 లక్షల వరకు డిమాండ్

కూటమి ప్రజాప్రతినిధులు లేఅవుట్లపై దృష్టి సారించారు. కేవలం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, ఇతరులు వేసిన లేఅవుట్ల యజమానులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా అధికారంలోకి వచ్చీరాగనే జేసీబీలు పెట్టి అనధికార లేఅవుట్లని ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో యజమానులు బేరం పెట్టారు. ప్రాంతాన్ని బట్టి ప్రతి ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు, ప్రతి లేఅవుట్‌లో ప్లాటు ఇవ్వాలని డిమాండ్ పెట్టారు. లేదంటే వెంచర్ల ఎంట్రన్స్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్చ్‌లను, ప్లాట్లకు వేసిన రాళ్లను జేసీబీలు పెట్టి ధ్వంసం చేశారు. జిల్లాలో కావలి, కందుకూరు, సర్వేపల్లి, నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలో వైఎస్సార్‌సీపీ, ఇతరులు వేసిన లేఅవుట్లలో కూటమి ప్రజాప్రతినిధులు ఈ తరహా విధ్వంసానికి తెగబడ్డారు. ఇదే ప్రాంతంలో ఎమ్మెల్యేలు, వారి అనుచరులు వేసిన లేఅవుట్ల వైపు కన్నెత్తి



నరుకూరులో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన అనుమతి లేని లేఅవుట్

కూడా చూడలేదు. తాజాగా అనధికార లేఅవుట్ జాబితా అంటూ ఏకంగా మున్సిపల్, నుడా పేరుతో పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఈ జాబితాలో టీడీపీ వర్గానికి చెందిన లేఅవుట్లు లేకపోవడం కూటమి కుట్రలకు అద్దం పడుతోంది.

రూ.కోట్లు దండుకుని.. తర్వాత ఆంక్షలు

జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ, ఇతరులు వేసిన లేఅవుట్లు వివరాలు తెప్పించుకున్నారు. ఆయా లే అవుట్ల ముందు సాగునీటి కాలువ ఉందని, అనుమతులు లేవని, రకరకాల సాకులు చూపి రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి ఇప్పటికే రూ.కోట్లు వసూలు చేసుకున్నారు. కావలిలో దాదాపు 15 లేఅవుట్లలో జేసీబీలు పెట్టి రోడ్లను ధ్వంసం చేయించారు. సర్వేపల్లి, కందుకూరు, నెల్లూరులో లేఅవుట్ యజమానుల బెదిరించి రూ.కోట్లల్లో దండకాలు చేసుకున్నారు. రాష్ట్ర మున్సిపల్ మంత్రిగా నారాయణ బాధ్యతలు స్వీకరించిన వెంటనే నుడా పరిధిలో అనధికార లే అవుట్‌లు విచారణకు ఆదేశించారు. గత నెల 2న జీఓ ఆర్టీ నంబర్ 466 విడుదల చేశారు. జిల్లాలో లేఅవుట్ల పరిశీలనకు కె నాగసుందరి, డి రాంబాబు, పి మధుకుమార్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. టీడీపీ నేతలు, మద్దతుదారులకు సంబంధించిన అనధికార లే అవుట్లను పక్కన పెట్టేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, మద్దతుదారులకు సంబంధించిన 117 అనధికార లే అవుట్ల జాబితా తయారు చేశారు. ఇవి అనధికార లేఅవుట్లు కొనద్దంటూ ఆత్మకూరులో 10, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ పరిధిలో 40, కావలిలో 18, బోగోలు, గుడ్లూరు, మనుబోలు, మర్రిపాడు, పొదలకూరు, రాపూరు, వరికుంటపాడు, ఇందుకూరుపేట, వింజమూరు, టీపీగూడూరు, ఏఎస్‌పేట, కావలి మండలాల పరిధిలో 32 లేఅవుటపై మున్సిపల్, నుడా పేరుతో పత్రికల్లో ప్రకటనలు విడుదల చేశారు. ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులకు రూ.లక్షలు ముడుపులు ఇచ్చుకున్న రియల్టర్లు ఈ ప్రకటనతో కుంగిపోతున్నారు. దీంతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాయానికి ఆ జాబితాలను పంపించి వీటికి రిజిస్ట్రేషన్లు చేయొద్దని ఆదేశాలివ్వడంపై రియల్టర్లు ఆందోళన చెందుతున్నారు.

లబోదిబోమంటున్న కొనుగోలుదారులు

అనధికార లే అవుట్ల జాబితాలో పదేళ్ల, ఐదేళ్ల క్రితం నాటి వెంచర్లు కూడా ఉన్నాయి. ఇప్పటికే ఆయా లేఅవుట్లలో ప్లాట్లు చాలా మంది కొనుగోలు చేశారు. అందులో మిడిల్ క్లాస్ ఫ్యామిలీలు ఉన్నాయి. తిని, తినక నాలుగు రూపాయలు మిగిల్చుకుని, అప్పులు చేసి, బ్యాంకు రుణాలు తీసుకుని సొంతిళ్లు నిర్మించుకోవాలనే ఆశతో ప్లాట్లు కొనుగోలు చేశారు. చాలా వరకు కొందరు ఆయా లేఅవుట్లలో ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లు రిజిస్ట్రేషన్లు నిలిపి వేశారని తెలియగానే ఒక్క సారిగా వారిలో ఆందోళన మొదలైంది.



లేఅవుట్ ఆర్చ్‌ను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

పొగాకు డిమాండ్ తగ్గే అవకాశం




రైతులతో మాట్లాడుతున్న బోర్డు సెక్రటరీ వేణుగోపాల్, రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

- పరిమితంగా బోర్డు అనుమతి మేరకే పండించండి
- బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ వేణుగోపాల్, ఆర్ఎం లక్ష్మణరావు

మర్రిపాడు: ప్రపంచ దేశాల్లో కూడా పొగాకు సాగు పెరుగుతుందని, వచ్చే పంట కాలానికి మార్కెట్‌లో డిమాండ్ తగ్గే అవకాశం ఉందని బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ డీ వేణుగోపాల్, రీజనల్ మేనేజర్ ఎం లక్ష్మణరావు తెలిపారు. సోమవారం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. రైతులు వచ్చే పంట కాలానికి పొగాకు పంట నియంత్రణ చేయాల్సిన ఆవశ్యకతపై వివరించారు. అధికంగా పొగాకు పండిస్తే తగిన ధరలు పొందలేకపోవచ్చన్నారు. డీసీపల్లి వేలం కేంద్రం పరిధిలో 6.3 మిలియన్ కేజీలకు అనుమతినివ్వగా 10 మిలియన్ కిలోలను పండించారని, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వేలం కేంద్రాల పరిధిలో సాగు ఎక్కువ అయిందన్నారు. బోర్డు అనుమతించిన మేరకే సాగు చేస్తే మంచి ధరలు లభిస్తాయన్నారు. బ్యారెన్లను, పొలం అధిక ధరలకు కౌలుకు తీసుకుని పొగాకు పండించడం వల్ల నష్టపోయే ప్రమాదముందన్నారు. 2024–25 పంట కాలానికి బోర్డు అనుమతించిన మేర ఒక బ్యారెన్‌కు 3.37 హెక్టార్లలో 4,275 కిలోల పొగాకును మంచి నాణ్యతతో పండించాలని తెలిపారు. పొగాకు బోర్డు రైతుల సంక్షేమానికి అన్ని విధాలుగా సహాయ పడుతుందని, గత రెండేళ్లుగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అధిక పొగాకు అమ్మకాలను అనుమతికి మించి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

దుత్తలూరు: ఆరుబయట నిద్రిస్తున్న ఓ వ్యక్తిపై మతిస్థిమితం లేని వ్యక్తి రోకలి బండతో హత్యాయత్నానికి ఒడిగట్టాడు. ఈ ఘటన మండలంలోని నర్రవాడలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నర్రవాడకు చెందిన పులివర్తి నాగేశ్వరరావుకు కొంత కాలంగా మతిస్థిమితం లేదు. తరచూ ఇతరులతో గొడవ పడుతుండేవాడు. సోమవారం ఉదయం నుంచి గ్రామంలో అందరిని చంపేస్తానంటూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో వల్లెం విశ్వనాథరెడ్డి తన ఇంటి ఆరుబయట నిద్రపోతుండగా చూసి అతనిపై నాగేశ్వరరావు రోకలి బండతో తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలై కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన విశ్వనాథరెడ్డిని 108 వాహనంలో



వైద్యశాలలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఐ గిరిబాబు

చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. ఉదయగిరి సీఐ గిరిబాబు క్షతగాత్రుడి పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన పోలీసులకు మతిస్థిమితం లేని వ్యక్తి నుంచి ప్రతిఘటన ఎదురైంది. స్థానిక పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.15 కోట్ల భూమి హాంఫట్

టీడీపీ నేతల బరితెగింపు శ్రుతిమించిపోతోంది. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ఇసుక, గ్రావెల్, మట్టిని దోపిడీ చేసి రూ.కోట్లు దోచుకున్న ఆ పార్టీ నేతలు, కేడర్ ఇప్పుడు ప్రభుత్వ, దేవదాయశాఖ భూములపై రాబందుల్లా పడ్డారు. దేవాలయాల నిర్వహణకు పూర్వీకులు, దాతలు ఇచ్చిన భూములు కూడా స్వాహా చేస్తున్నారు. దేవుడు భూములనే స్పృహ లేకుండా, భక్తుల మనోభావాలు లెక్క చేయకుండా కబ్జా చేస్తూ తాలిబన్ల పాలనను గుర్తుకు తెస్తున్నారు. ఈ భూదోపిడీని అడ్డుకోవాల్సిన పోలీసులు, అధికారులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు.

కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి టీడీపీ నేతల బరితెగింపు

- దేవదాయశాఖ భూమి కబ్జా
- ఈఓ ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- ఈ వ్యవహారం వెనుక అధికార పార్టీ పెద్దల ప్రమేయం
- ముళ్ల పొదలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ, దేవదాయశాఖ భూములు కబ్జాకు గురవుతున్నాయి. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి సొంత జిల్లాలోనే దేవాలయ భూమిని కాజేశారు. వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ సర్వే నంబరు 78/1లో 6.08 ఎకరాల భూమిని పూర్వం ఓ దాత ప్రకాశం జిల్లా పామూరులో ఉన్న శ్రీమదన వేణుగోపాలస్వామి దేవస్థానానికి ఇచ్చారు. 1956 ఫసలి నుంచి రెవెన్యూ రికార్డుల్లో (ఫేర్ అడంగళ్‌లో) శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం పేరుపై భూమి నమోదై ఉంది. దేవదాయ ధర్మదాయశాఖ సెక్షన్ 43 రిజిస్టర్‌లో కూడా నమోదైంది. అంటే ఈ భూమి దేవదాయశాఖకు చెందినదే అని అన్నీ రికార్డుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

ధరలు పెరగడంతో కబ్జాదారుల కన్ను

ఈ భూమి పామూరు పట్టణానికి అతి సమీపంలో 167 జాతీయ రహదారికి అనుకుని ఉంది. రూ.కోట్లలో ధర పలుకుతుండడంతో స్వాహా చేసేందుకు కుట్రలకు తెరలేపారు. అందులో భాగంగా 3 ఎకరాల భూమిని 2016 అక్టోబరు 28న ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన టీడీపీ నేతలైన పువ్వాడి రాంబాబు, ఆయన బావ కూండ్ల సురేంద్ర జలదంకి మండలం బ్రాహ్మణకాకకు చెందిన పరాంకుశం వెంకట గోపాలాచార్యులు, కుందూరు తిరుపతిరెడ్డి ద్వారా బోగస్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయం ఎవరికి తెలియకుండా కొంతకాలంగా గోప్యంగా ఉంచారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు రాంబాబు, సురేంద్ర అప్పటి తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబుకు మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ రికార్డులు పరిశీలించకుండానే రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లను నమోదు చేశారు. అయితే డిజిటల్ కీ రిలీజ్ చేయలేదు. ఎన్నికలు జరగడం, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో మౌనంగా ఉన్నారు. 2023లో తమ పేర్లు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా, డిజిటల్ కీ వదలలేదని అప్పటి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు రాంబాబు, సురేంద్ర వినతిపత్రం ఇచ్చారు.



దేవుడి మాన్యంలో చెట్లు తొలగించి చదును చేస్తున్న జేసీబీలు, దోజర్

వాస్తవం వెలుగు చూసిన వైనం

ఈ భూమికి సంబంధించి పూర్తి రికార్డులు పరిశీలించిన జేసీ ఇది దేవదాయశాఖ భూమిగా గుర్తించారు. వెంటనే శ్రీమదన వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులకు, ఆలయ ఈఓకు విచారణకు రావాల్సిందిగా నోటీసులు పంపారు. అప్పటి వరకు ఈ వ్యవహారం ఆలయ ఈఓకు, కమిటీ సభ్యులకు తెలియదు. దీంతో వారు జేసీ విచారణకు హాజరై అన్నీ డాక్యుమెంట్లు సమర్పించారు. దీంతో జేసీ ఈ భూమి దేవాలయానికి సంబంధించినదిగా నిర్ధారిస్తూ, వెంటనే రెవెన్యూ రికార్డుల్లో శ్రీమదన వేణుగోపాలస్వామి పేరు నమోదు చేసి, 22ఏ నిషేధ జాబితాలో చేర్చాలని ఆర్‌సీ డీ5.589 పేరుతో 26.10.2023 తేదీన వరికుంటపాడు తహసీల్దార్‌కు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అయితే రెవెన్యూ అధికారులు రికార్డుల్లో ఆ మార్పులు చేయలేదు.

టీడీపీ అధికారంలోకి రావడంతో..

2024లో టీడీపీ అధికారంలోకి రావడంతో భూమి తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్లాన్ చేశారు. జేసీ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌పై రాంబాబు, సురేంద్ర కోర్టుకు వెళ్లగా పదిహేను రోజుల పాటు ఎవరూ భూమిలో ప్రవేశించకూడదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అయితే కోర్టు ఉత్తర్వులు పట్టించుకోకుండా అధికార అండతో బరితెగించారు. బోగస్ రిజిస్ట్రేషన్ చేసుకున్న టీడీపీ నేతలు రాంబాబు, సురేంద్ర అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు సమీప బంధువులతో ఓ అవగాహనకు వచ్చి కబ్జాకు బరి తెగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శనివారం ఉదయం దేవదాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు తొలగించారు. యంత్రాల ద్వారా చెట్లు తీసివేసి, భూమి దుక్కి దున్ని కంచె ఏర్పాటు చేయడం చకచకా సాగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఆలయ ఈఓ జీ నరసింహారావు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ఈ వ్యవహారం వెనుక పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.



శ్రీమదన గోపాలస్వామి దేవాలయం

దేవుడి భూమి కబ్జా చేశారు..

మదన వేణుగోపాలస్వామి భూమి కబ్జా విషయం తెలియగానే పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదు. దీంతో మా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. దేవుడు మాన్యం కబ్జా భక్తులను తీవ్ర వేదనకు గురి చేస్తోంది. ఈ విషయం మా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలు మేరకు చర్యలు తీసుకుంటాం.
– నరసింహారావు,ఆలయ ఈఓ



సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్లు, నర్సులకు రక్షణ కల్పించాలి. ముఖ్యంగా సీసీ కెమెరాలు, విశ్రాంతి గదులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో డ్యూటీలు చేసే నర్సులకు భద్రత కల్పిస్తే బాగుంటుంది. మహిళలపై అరాచకాలను అరికట్టాలంటే చట్టాలను కఠినతరం చేయాలి.

– రాధాకుమారి, ఏఎన్ఎం, పొదలకూరు

పటిష్ట భద్రత అవసరం



విధుల్లో ఉన్న మహిళా వైద్యులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణతోపాటు పటిష్ట భద్రత కల్పించాలి. కోల్‌కతా తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. పీహెచ్‌సీలో విధులు నిర్వహించే సమయంలో కొన్ని సందర్భాల్లో రోగులతో వచ్చిన వారితో ఇబ్బందులొస్తున్నాయి. అటువంటివి జరగకుండా చూడాలి.

– స్వప్నారెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు, సీతారామపురం

దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను కిరాతకంగా చంపడం, రెండు రోజుల క్రితం తిరుపతిలోని ప్రభుత్వ వైద్యశాలలో మహిళా డాక్టర్‌పై దాడికి పాల్పడిన కేసుల్లో దోషులను కఠినంగా శిక్షించాలి. ఉదాసీనంగా వ్యవహరిస్తే ఇలాంటి దాడులు మరిన్ని జరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు అమలు చేసి డాక్టర్లకు రక్షణ కల్పించాలి.

– డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అనంతసాగరం



అర్హులకు కాదు.. తెలుగు తమ్ముళ్లకే..

- జిల్లాలో ఉపాధి నిధులతో 1,300 షెడ్ల మంజూరు
- 2018లో గోకులాల పేరుతో నిర్మాణాలు
- అప్పట్లో అవి టీడీపీ కార్యకర్తలకే కేటాయింపు
- నేడు మరలా వారికే గోకులాలు, మినీగోకులాల కేటాయింపు

ప్రజల కోసం ఏమైనా చేయాలంటే సీఎం చంద్రబాబుకు మనసొప్పదు. అదే తెలుగు తమ్ముళ్ల కోసం మాత్రం అడ్డగోలుగా నిధులు మంజూరు చేస్తారు. 2018లో గోకులాల పేరుతో టీడీపీ కార్యకర్తలకు షెడ్లు మంజూరు చేశారు. తాజాగా ఉపాధి హామీ పథకం నిధులను తెలుగు తమ్ముళ్లకు ఫలహారంగా అందించేందుకు 90 శాతం సబ్సిడీపై షెడ్ల నిర్మాణానికి కేటాయించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భిన్నంగా వ్యవహరించింది. సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాలు వంటివి గ్రామాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది.

ఉదయగిరి: ప్రజల సొమ్మును టీడీపీ కార్యకర్తలకు అప్పనంగా దోచిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. మినీ గోకులాల పేరుతో పథకాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. 2014 – 19 మధ్య కూడా ఉపాధి నిధులు తమ పార్టీ వారికి అనుకూలంగా ఖర్చు చేశారు. నీరు – చెట్టు పేరుతో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పచ్చనేతలు స్వాహా చేసిన చరిత్ర ఉంది. 2018లో నిబంధనలతో ఏ మాత్రం సంబంధం లేకుండా షెడ్లను మంజూరు చేసి తెలుగు తమ్ముళ్లకు ఇచ్చారు. తాజాగా పశువులు, సన్నజీవాలు, కోళ్లకు షెడ్ల నిర్మాణాలు చర్యలు తీసుకున్నారు. వాటిని తమ కార్యకర్తలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

యూనిట్లు మంజూరు

జిల్లాలోని 37 మండలాలకు 1,300 యూనిట్లు మంజూరు చేశారు. తొలివిడతగా ఒక్కో మండలానికి 25 షెడ్ల చొప్పున కేటాయించారు. అయితే తీర ప్రాంత మండలాలైన కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు తదితర మండలాలకు 50 షెడ్ల చొప్పున మంజూరు చేశారు. వీటి నిర్మాణానికి ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుంది. లబ్ధిదారుడు కేవలం 10 శాతం మాత్రమే చెల్లించాలని నిబంధన పెట్టింది. టీడీపీ కార్యకర్తలు వాటి కోసం పోటీ పడుతున్నారు. తమకే కేటాయించాలని ముఖ్య నేతలపై ఒత్తిడి పెంచుతున్నారు. అసలైన లబ్ధిదారులకు ఈ యూనిట్లు మంజూరు చేసే అవకాశమే కనిపించడం లేదు.

అడ్డగోలుగా దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తుల స్వీకరణలో నిబంధనలు పాటించడం లేదు. వాస్తవానికి జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామసభలు నిర్వహించి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలి. కానీ ఎక్కడా అలా జరగడం లేదు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇష్టానుసారంగా దరఖాస్తులు తీసుకుంటున్నారు. వాటిని పశువైద్యాధికారులు పరిశీలిస్తారు. కానీ లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఎంపీడీఓలకు అప్పజెప్పారు. గతంలో చేసినట్లుగా ఈసారి కూడా టీడీపీ కార్యకర్తలకే షెడ్ల ఎత్తున షెడ్లు మంజూరు చేసేందుకు టీడీపీ పెద్దలు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. తమ కార్యకర్తల దరఖాస్తులనే తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. పంచాయతీల ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ అలా జరగడం లేదు. దరఖాస్తులు తీసుకునేందుకు గడువు నిర్ణయించలేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 1,000 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.



గతంలో తెలుగుదేశం పాలనలో నిర్మించిన గోకులం షెడ్డు

రాయితీ వివరాలిలా..

షెడ్లు	ధర	రాయితీ	రైతు వాటా
2 పశువులు	రూ.1,15,000	రూ.1,03,500	రూ.11,500
4 పశువులు	రూ.1,85,000	రూ.1,66,500	రూ.18,500
6పశువులు	రూ.2,30,000	రూ.2,07,000	రూ.23,000

సన్నజీవాలకు..

షెడ్లు	ధర	రాయితీ	రైతు వాటా
20 గొర్రెలు లేదా మేకలు	రూ.1,30,000	రూ.91,000	39,000
50 గొర్రెలు	రూ.2,30,000	రూ.1,61,000	రూ. 69,000
100 కోళ్లు	రూ.87,000	రూ.60,900	రూ.26,100
200 కోళ్లు	రూ.1,32,000	రూ.92,400	రూ.39,600

దరఖాస్తులు తీసుకుంటున్నాం

షెడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం దరఖాస్తులు తీసుకుంటున్నాం. తుదిగడువు ఇంకా చెప్పలేదు. ఇంతవరకు 1,000 దరఖాస్తులు వచ్చాయి. నాన్ డెల్టా మండలాలకు 25 చొప్పున, తీర ప్రాంతమండలాలకు 50 యూనిట్లు చొప్పున మంజూరు చేశారు. లబ్ధిదారులు ఎంపిక ఎంపీడీఓలు చేస్తారు. మేం కేవలం అర్హత మాత్రమే ధ్రువీకరిస్తాం.

– కోటేశ్వరరావు, జేడీ, జిల్లా పశువైద్యాధికారి

ఆదర్శం.. నాటి వైఎస్సార్‌సీపీ పాలన

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించింది. స్థానికంగానే సమస్యల పరిష్కారం కోసం సచివాలయాలు, ఇంకా రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. పారదర్శకంగా భవనాల నిర్మాణం చేపట్టింది. కానీ కూటమి ప్రభుత్వంలో ఇలాంటి వాటిని పట్టించుకోకుండా తమ కార్యకర్తలకే షెడ్లు కట్టబెట్టేలా చర్యలు తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



వైఎస్సార్‌సీపీ పాలనలో వింజమూరు మండలంలో నిర్మించిన సచివాలయ భవనం

15న ప్రశంసాపత్రం.. 20న వీఆర్‌కు!

- ఉలవపాడు ఎస్సై బదిలీ వెనుక ఏం జరిగిందో..
- తమకు కావాల్సిన వారి కోసమే చేశారా?
- అధికార పార్టీ ప్రమేయం ఉందా?
- పోలీస్ శాఖ తీరుపై విమర్శలు

ఉలవపాడు: విధి నిర్వహణలో ఈ ఏడాది ప్రతిభ చూపాడని ఆ ఎస్సైకు ఆగస్టు 15వ తేదీన ప్రశంసాపత్రం ఇచ్చారు. ఐదురోజులు గడిచిందో లేదో ఆయన్ను వేకన్సీ రిజర్వ్ (వీఆర్)కు పంపారు. ఈ మధ్యలో ఎస్సై అంత పెద్ద తప్పులు ఏమైనా చేశారా? లేక ఏదైనా వివాదాస్పదంగా వ్యవహరించారా? అంటే ఏదీ లేదు. తమకు కావాల్సిన వారిని తెచ్చుకునేందుకే వీఆర్‌కు పంపినట్లు ప్రచారం జరుగుతోంది.

ఎందుకో..

ఉలవపాడు ఎస్సైగా బాజిరెడ్డి ఉన్న సమయంలో కేసుల ఛేదనలో, లా అండ్ ఆర్డర్ అమల్లో ప్రతిభ చూపాడని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కొద్దిరోజులుగా పోలీస్ శాఖలో బదిలీలు జరుగుతున్నాయి. ఏం జరిగిందో తెలియదు కానీ అనూహ్య రీతిలో 20వ తేదీన బాజిరెడ్డిని వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రశంసాపత్రం అందుకున్న ఎస్సై వీఆర్‌కు బదిలీ కావడంతో ఆ శాఖ మొత్తం అవాక్కైంది. ఆయన్ను వేరే మండలానికి బదిలీ చేయడానికి బదులు పోస్టింగ్ ఇవ్వకుండా ఆపడం విమర్శలకు దారి తీసింది. బాగా పనిచేసిన వారికి ఇలా జరుగుతుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ఆగస్టు 15న అవార్డు ఇవ్వకుండా నేరుగా వీఆర్‌కు పంపించి ఉంటే ఎవరికీ అనుమానాలుండేవి కాదు. దీనిని రాజకీయ బదిలీగానే అందరూ భావిస్తున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న బాజిరెడ్డి (ఫైల్)

రాజకీయ జోక్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసు శాఖలో రాజకీయ జోక్యం పెరిగిపోయింది. టీడీపీ పెద్దల మాటల్ని కొందరు పోలీస్ ఉన్నతాధికారులు తూచా తప్పకుండా పాటిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పనితీరు రెండో ప్రాధాన్యతగా మారిందనే మాట వినిపిస్తోంది. కందుకూరు నియోజకవర్గంలో ఎస్సైల పోస్టింగ్‌లు దాదాపు ఆలస్యంగానే జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సిఫార్సును తప్పనిసరిగా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ప్రభుత్వ పెద్దలు బేరసారాలు పెట్టి అధిక మొత్తం ఇచ్చిన వారికే పోస్టింగ్‌లు ఇచ్చారనే ప్రచారం ఉంది.

ఏమై ఉంటుందో..

ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తే 20 ఏళ్లలో 85 శాతం మంది ఎస్సైలు వీఆర్‌కు వెళ్లారు. ఇప్పుడు పంపడం కొత్త కాకపోయినా 15న అవార్డు తీసుకుని 20న వీఆర్‌కు వెళ్లడాన్ని చూస్తుంటే రాజకీయ కోణమే కనిపిస్తోంది. ఎమ్మెల్యే సొంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అంకమ్మను 20న ఇక్కడికి బదిలీ చేయడం, ఆయన 23న విధుల్లో చేరడం చకచకా జరిగిపోయింది. దీనిని బట్టి తమకు కావాల్సిన వారి కోసమే బాజిరెడ్డిని వీఆర్‌కు పంపారా? లేక ఇతర విషయాలు ఏవైనా ఉన్నాయా? అనే చర్చ జరుగుతోంది.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

లింగసముద్రం: నాలుగు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని వీఆర్ కోట గ్రామ శివారుల్లో ఉన్న మన్నేరు నుంచి సోమవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు వెళ్లి విశ్వనాథపురం బ్రిడ్జి వద్ద ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 107
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 220
లేయర్ చికెన్	: 178

పాతనేరస్తుడి దారుణ హత్య

- మద్యం మత్తులో వాగ్వాదం
- స్నేహితులే హంతకులు
- నిందితులంతా పాతనేరస్తులే..

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో నెలకొన్న వాగ్వాదం ఓ పాతనేరస్తుడి హత్యకు దారి తీసింది. అప్పటి వరకు అతడితో కలిసి మద్యం తాగిన ఇద్దరు వ్యక్తులతోపాటు మరో ఇద్దరు కలిసి దారుణంగా చంపేసి పరారయ్యారు. ఈ ఘటన నెల్లూరు రామలింగాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జనశక్తినగర్‌కు చెందిన గుంజి రవి (32) అలియాస్ కత్తి రవి పాతనేరస్తుడు. అతను ఈ ఏడాది ఏప్రిల్లో జ్యోతినగర్‌కు చెందిన వెంకటేష్ అలియాస్ వెంకీ, మరో వ్యక్తితో కలిసి ఆటోనగర్‌లో దశరథ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశాడు. ఆ ఘటనలో వేదాయపాళెం పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జూలైలో బయటకు వచ్చిన రవి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆదివారం భార్యకు చెప్పి నెల్లూరుకు వచ్చాడు. మధ్యాహ్నం అనగుంటలోని తన స్నేహితుడు ఇంట్లో వివాహ కార్యక్రమంలో పాల్గొన్నాడు.

మద్యం తాగి..

వివాహానికి హాజరైన అనంతరం రవి పాతమిత్రులైన రౌడీషీటర్లు సాయితేజ అలియాస్ కమ్మ సాయి, వెంకటేష్, మరికొందరితో కలిసి పూటుగా మద్యం తాగాడు. ఈ క్రమంలోనే అనగుంటకు చెందిన రవితేజ వారిని కలిశాడు. అందరూ కలిసి రవితేజ ఆటోలో జనశక్తినగర్‌కు వెళ్లి ఆదివారం రాత్రి వరకు పూటుగా మద్యం తాగారు. రౌడీషీటర్ సుజన్‌కృష్ణ అలియాస్ చింటూ మద్యం తాగుతున్న వారిలో ఓ వ్యక్తికి ఫోన్ చేసి రవితేజను తిట్టాడు. ఈ విషయాన్ని గమనించిన రవి ఫోన్ తీసుకుని చింటూతో వాగ్వాదానికి దిగాడు. వారి మధ్య మాటల యుద్ధం జరిగింది. చింటూ ముత్తుకూరు బస్టాండ్ వద్ద ఉన్నానని చెప్పాడు. రవి కోపంలో రవితేజతో కలిసి ఆటోలో ముత్తుకూరు బస్టాండ్ వద్దకు బయలుదేరగా మిగిలిన వారు అక్కడే ఉండిపోయారు. రవితేజ వద్దని వారించినా రవి వినిపించుకోలేదు. అప్పటికే అర్ధరాత్రి దాటిపోయింది. చింటూకు ఫోన్ చేసినా తీయకపోవడంతో గంటపాటు బస్టాండ్ వద్ద ఎదురు చూసి రవి బయలుదేరాడు. రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు చేరుకునే సరికి చింటూ ఫోన్ చేశాడు. తాను ఎక్కడున్నానో రవి వారికి చెప్పాడు. చింటూ, మరో వ్యక్తి మోటార్‌బైక్‌పై అక్కడికి చేరుకుని అతడితో గొడవకు దిగాడు. ఇంతలో మరో బైక్‌పై కమ్మ సాయి, వెంకటేష్ రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య ఏం జరిగిందో కానీ కమ్మ సాయి తన వెంట తెచ్చుకున్న కత్తితో రవిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. అనంతరం నలుగురూ కలిసి అతడిని దారుణంగా చంపి పరారయ్యారు.



రవి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు



రవి (ఫైల్)

మృతదేహానికి పోస్టుమార్టం

సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రత్యక్ష సాక్షి రవితేజను పిలిపించి వివరాలు సేకరించి అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమీపంలోని సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం చేశారు.

విభిన్న కోణాల్లో దర్యాప్తు

రవితేజ చెప్పిన వివరాలతోపాటు విభిన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులందరూ మృతుడికి స్నేహితులే. హత్యకు కొంతసేపటి ముందు కలిసి మద్యం తాగారు. చిన్నపాటి వాగ్వాదమే హత్యకు దారితీసిందా? లేక ఇతర కారణాలున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హత్యకు కొన్ని గంటల ముందు మృతుడు మద్యం మత్తులో చింటూపై దాడి చేశాడని, నిందితుల్లో ఒకరి కుటుంబ విషయాల్లో అతను తలదూర్చాడనే ప్రచారం ఉంది. దీంతోనే పథకం ప్రకారం చంపి ఉండొచ్చని పోలీసులు ఆ దిశగా కేసు విచారిస్తున్నారు. ఏది ఏమైనా రవి హత్య నగరంలో కలకలం రేకెత్తించింది.

నిందితులపై కేసులు

నిందితుల్లో ఒకరైన కమ్మ సాయి పీడీయాక్ట్‌లో జైలు జీవనం అనుభవించి బయటకు వచ్చాడు. వెంకటేష్‌పై మర్డర్ కేసు ఉంది. చింటూపై రౌడీషీట్‌తోపాటు మర్డర్ కేసులున్నాయి.

మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నవాబుపేట పరుచూరివారి వీధికి చెందిన పరిమళ (38), చలపతి దంపతులకు గాయత్రి కుమార్తె అనే కుమార్తె ఉంది. భర్త చనిపోవడంతో పరిమళ కుమార్తెను పెంచి పెద్ద చేసి సంగంకు చెందిన రవి అనే వ్యక్తికిచ్చి వివాహం చేసింది. కొంతకాలంగా పరిమళ తన తల్లితో ఉంటోంది. ఇటీవల తల్లి సైతం అనారోగ్యంతో మృతిచెందింది. దీనిని తట్టుకోలేక ఒంటరితనంతో పరిమళ మనస్తాపానికి గురై ఈనెల 25వ తేదీ రాత్రి తన ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఈ విషయాన్ని గాయత్రికి తెలియజేశారు. ఆమె నెల్లూరుకు చేరుకుని తల్లి మృతిపై నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి సోమవారం బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

ప్రతి వస్తువుకు బిల్లు తప్పనిసరి

- సెంట్రల్ జీఎస్టీ ఏపీ కమిషనర్ (ఆడిటింగ్ వింగ్) ఆనంద్ కుమార్

నెల్లూరు సిటీ: దుకాణాల్లో కొనుగోలు చేస్తున్న ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సెంట్రల్ జీఎస్టీ ఏపీ కమిషనర్ (ఆడిటింగ్ వింగ్) పి.ఆనంద్ కుమార్ ప్రజలకు సూచించారు. నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడిటింగ్ వింగ్ బలోపేతానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో సెంట్రల్ జీఎస్టీ ఆడిటింగ్ వింగ్ కార్యాలయాలు ఉన్నాయన్నారు. త్వరలో అనంతపురం, కర్నూలులోనూ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తమ పరిధిలోని అన్ని సంస్థల్లో ఆడిటింగ్ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఇంకా 500కు పైగా సంస్థల్లో జీఎస్టీ ఆడిటింగ్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. పన్నులు ఎగవేసినా, తప్పుడు లెక్కలతో తక్కువ చెల్లించినట్లు తేలినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసిన వ్యాపారులు తప్పకుండా ప్రభుత్వాలకు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. వ్యాపారాలందరూ జీఎస్టీ విధానం ద్వారా సకాలంలో పన్నులు చెల్లిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ ఉషాకిరణ్, సూపరింటెండెంట్లు మల్లెల శ్రీనివాసరావు, ఎన్‌జెనేంద్ర కుమార్, ఎన్‌మార్కొండేయ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ ఆఫీస్‌లో ప్రారంభోత్సవం చేస్తున్న ఆనంద్ కుమార్

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

మనుబోలు: రైల్లో నుంచి పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మనుబోలు పెద్ద చెరువు రైల్వే ట్రాక్ వద్ద జరిగింది. రైల్వే ఎస్సై మాలకొండయ్య కథనం మేరకు.. ఆదివారం రాత్రి చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న రైల్లో నుంచి 143వ కిలోమీటర్ వద్ద ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడిపోయి వంతెనను ఢీకొని చెరువులో పడిపోయి మృతిచెందాడు. ఈ మేరకు కీమెన్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు నలుపు రంగుపై తెలుపు గళ్లున్న చొక్కా, నల్ల రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించిన పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యువకుడి మృతదేహం

పట్టాలపై మృతదేహం

కొడవలూరు: మండలంలోని తలమంచి రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండగా రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. హెడ్‌కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వరరావు కథనం మేరకు.. చనిపోయిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహం ఉన్న తీరును బట్టి రెండు రోజుల క్రితం రైల్లో నుంచి పడి మృతిచెంది ఉండొచ్చని చెబుతున్నారు. అతను ఎరుపు బ్లూ కలర్ చెక్స్ కలిగిన హాఫ్ హ్యాండ్స్ షర్ట్, లోపల ఫుల్ బనియన్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు.